ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.17.12.2024 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ఒకే దేశం-ఒకే ఎన్నిక బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ఈ రోజు లోక్ సభలో ప్రవేశపెట్టారు.
2. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5 రోజుల శీతాకాల విడిది కోసం ఈ సాయంత్రం రాష్ట్రానికి రానున్నారు.
3. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో సుమారు 51 వేల 277 కోట్ల రూపాయల రుణాలను ఎఫ్ఆర్ బీఎం నిబంధనలకు లోబడి తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో తెలిపారు.
4. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం 11 ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.

ONE NATION ONE ELECTION

ఈ రోజు లోక్ సభలో ఒకే దేశం  ఒకే ఎన్నిక బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, ఎన్‌సిపి (ఎస్‌పి), సిపిఎం సహా విపక్షాలు వ్యతిరేకించాయి.  వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును తమ పార్టీ తిరస్కరిస్తున్నదని, దానిని ప్రవేశపెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. ఈ బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ భావిస్తోందని అన్నారు.

NSD

రాష్ట్రపతి-హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5 రోజుల శీతాకాల విడిది కోసం ఈ సాయంత్రం  రాష్ట్రానికి రానున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అమరావతిలోని మంగళగిరి-ఎయిమ్స్ లో  స్నాతకోత్సవానికి హాజరై  గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఈ సాయంత్రం  హకీంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్తారు. ఈ నెల 21వ తేదీ వరకు హైదరాబాద్ లో  ఉండనున్న రాష్ట్రపతి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తన పర్యటన సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో చేపట్టిన పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, కళాకారులు, వివిధ సంఘాల నాయకులను కలుసుకుంటారు. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి భవన్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

(ఎంఎస్‌ఎల్ /డెస్క్)

ఆర్టీసీ-పొన్నం:

మంచిర్యాల జిల్లా చెన్నూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సంబంధించిన భూమిపై హైకోర్టు స్టే ఉందని, స్టే తొలగిన వెంటనే డిపో పనులను పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, చెన్నూరు బస్ డిపో కోసం 4 కోట్ల రూపాయిలు మంజూరు అయినట్లు వెల్లడించారు. అయితే ఈ ఏడాది మొదట్లో భూమి విషయమై కోర్టు స్టే ఇచ్చిందనీ పేర్కొన్నారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం, ధర్మపురి, కొండగట్టు ఆలయాలను కలుపుతూ బస్సు సేవలను అందుబాటులోకి తెస్తామని మంత్రి పేర్కొన్నారు.

(ఎంఎస్ఎల్)

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల...

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు రెండో పంటకు నీటి విడుదలను ప్రారంభించినట్లు నాగర్జున సాగర్ ప్రాజెక్టు సాగర్ సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ ఎస్ఈ శ్రీధరరావు తెలిపారు.. సాగర్ లోని ఎస్ఈ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నీటి విడుదల వివరాలను వెల్లడించారు. వచ్చే రబీ సీజన్ కు సంబంధించి సాగర్ ఎడమ కాలువ పరిధిలో పంటల సాగు కోసం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు 7 దఫా లుగా నీటి విడుదల జరుగుతుందని తెలిపారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

నల్లగొండ- వివాద్ సే విశ్వాస్ స్కీం

ఆదాయ పన్ను శాఖ హైదారాబాద్ కమిషనర్ పర్యవేక్షణలో నల్గొండ శాఖ ఆధ్వర్యంలో వివాద్ సే విశ్వాస్ స్కీం-2024 పై అవ గాహన సదస్సు నిర్వహించారు. నల్గొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ఈ సదస్సుకు నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఛార్టెడ్ అకౌంటెంట్లు, ఆదాయపు పన్ను ప్రాక్టీసుదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను డిప్యుటీ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ 2024 అక్టోబరు 1 నుంచి అమ లులోకి వచ్చిన వివాద్ సే విశ్వాస్ స్కీంను ఉపయోగించుకుని ఆదాయపు పన్ను సంబంధిత వివాదాలను పరిష్క రించుకోవాలని సూచించారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

సీపీఎం- తమ్మినేని వీరభద్రం

ప్రజా పోరాటాలతోనే సీపీఎం బలోపేతం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిన్న జరిగిన సీపీఎం మూడో మహాసభకు వీరభద్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు ఉత్తర భాగంలో అలైన్మెంట్ ను ఓఆర్ఆర్ నుంచి 28 కిలోమీటర్లకు కుదించడం వల్ల నష్టపోతున్న రైతులకు న్యాయం కోసం సీపీఎం అండగా ఉంటుందని చెప్పారు.

(పీ టీ సీ యాదాద్రి భువనగిరి)

అప్పులు-భట్టి

ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 51 వేల 277 కోట్ల రూపాయల రుణాలను ఎఫ్ఆర్ బీఎం నిబంధనలకు లోబడి తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో తెలిపారు. ఇదే ఏడాదిలో మరో 55 వేల కోట్ల రూపాయల పైచిలుకు రుణాలను వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ పూచీ లేకుండా తీసుకున్నాయని వివరించారు. ఇదే సమయంలో గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిపై వడ్డీల కింద 66 వేల కోట్ల రూపాయలను తిరిగి చెల్లించినట్లు మంత్రి వివరించారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విషయం చెప్పారు. తాము అధికారం చేపట్టే నాటికి ఉన్న 40 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించుకుంటూ వస్తున్నట్టు తెలిపారు. ఇంత వరకు 14 వేల కోట్ల రూపాయల మేర పెండింగు బిల్లులను తిరిగి చెల్లించినట్లు పేర్కొన్నారు. శాసన సభను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు చేసిన ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు.

(బైట్ భట్టి విక్రమార్క)

హరీశ్ రావు

అంతకుముందు హరీశ్ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు, విద్యుత్ బకాయిలు వంటి అంశాలతో ఆర్థిక మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అప్పులతో ఆస్తుల కల్పన చేసిందన్నారు.

రెవెన్యూ:

రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం 11 ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాలు సమయంలో ఒక ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఆలేరును రెవెన్యూ డివిజన్ గా వీలైనంత త్వరగా ప్రకటించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నారాయణపేట జిల్లా మక్తల్, వనపర్తి జిల్లా ఆత్మకూరును రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించే విషయం కూడా పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. మరో ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల ఇబ్బందుల్ని తొలగించేలా కొత్త డివిజన్లు, మండలాల ఏర్పాటును చేసే విషయాన్ని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

(బైట్– పొంగులేటి)

కాగా, రాష్ట్రంలోని ఏ ఒక్క జిల్లాను, మండలాన్ని, డివిజన్ ను రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి పునరుద్ఘాటించారు.

ఎంఎస్ఎల్

వాతావరణం

రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. గత మూడు రోజులుగా చాలా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదవడంతో తీవ్ర చలిగాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదిలాబాద్ లోని రామనగర్ వద్ద గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 5.9 డిగ్రీల సెల్సియస్ గా నమోదైంది. హైదరాబాద్ రాజేంద్రనగర్ లో అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 9.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాగల 48 గంటల్లో పలు జిల్లాల్లో

అక్కడక్కడా ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని, హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

(డెస్క్)

వనపర్తి - సీఎం కప్

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను ఒలంపిక్స్, ఆసియా క్రీడలు వంటి విశ్వ క్రీడల్లో వ్యాప్తింపజేయాలన్న ముఖ్య ఉద్దేశ్యం తో సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా మైదానంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి జిల్లా స్థాయి సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు.

(వనపర్తి జిల్లా పిటిసి)

మంచిర్యాల- సీఎం కప్

నేటి నుంచి సీఎం కప్- 2024 మంచిర్యాల జిల్లా స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ కీర్తి రాజవీరు ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఐదు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగే ఈ పోటీలలో మొదటి రోజు వాలీబాల్, బాస్కెట్ బాల్, నెట్ బాల్, యోగ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా)

మంచిర్యాల-లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్ ద్వారా సైబర్ నేరాల కేసుల పరిష్కారంలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందని ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ  ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో పరిష్కారం కాని 174 కేసులను ఇటీవలి లోక్ అదాలత్ లో

పరిష్కరించి 71 లక్షల 52 వేల రూపాయలను బాధితులకు పరిహారంగా ఇప్పించామన్నారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా)

సిరిసిల్ల-సీఎం కప్

రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలను రేపటి నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. అసక్తికల క్రీడాకారులు సీఎం కప్ వెబ్ సైడ్ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారినే పోటీలకు అనుమతిస్తామని తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

సిరిసిల్ల-సోషల టాలెంట్ టెస్ట్

తెలంగాణ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ ను జనవరి 4వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి బి.జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)